సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 11 । మే । 2025



తల్లికి వందనం.. వీడని సందిగ్ధం!
తల్లికి వందనంపై ప్రభుత్వం వైపు నుంచి వారి అనుకూల పత్రికల ద్వారా వినిపిస్తున్న నిబంధనలు, మార్గదర్శకాలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. -10లో



అన్నమయ్య కోసం.. కదిలిన వారసులు
పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తం చేసేందుకు అన్నమయ్య 12వ తరం వారసులు నడుం బిగించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.109
రెండోరకం	రూ.66	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 465 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఉద్యోగోన్నతి

పాయకాపురం(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న సీఎస్ఎస్ఎస్ఎన్ రెడ్డిని ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లా డీఐఈఓగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేసింది. ఆయన పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జిల్లా ఒకేషనల్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఏలూరు నుంచి బి.ప్రభాకర్‌ను ప్రభుత్వం ఎఫ్ఏసీగా నియమించింది.

వీరుడి త్యాగం దేశం మరవదు



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్: ఉగ్రవాదాన్ని తుదిముట్టించడంలో భాగంగా భారతదేశం చేపట్టిన సిందూర్ ఆపరేషన్‌లో మన తెలుగుబిడ్డ మురళీనాయక్ త్యాగం దేశం ఎప్పటికి మరవదని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. మురళీనాయక్‌కు చిన్నప్పటి నుంచి గుండెల నిండా దేశభక్తి ఉండేదన్నారు. అదే ఆయనను సైనికుడిని చేసిందని తెలిపారు. దేశాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తూ వచ్చిన మురళీనాయక్ సిందూర్ ఆపరేషన్‌లో వీరోచిత పోరాటం చేసి అసువులుబాయడం బాధాకరమన్నారు. భారతదేశాన్ని కాపాడేందుకు సైనికులు చేసే త్యాగ్యం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డి.భాస్కర్‌రాజు, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, రేవరాజు శ్రీనివాస్‌రాజు, డీలర్ సుబ్బరామిరెడ్డి, వడ్డే రమణ, దయానంద, గౌస్‌బాషా, నాగా శేఖర్‌రెడ్డి, మిర్యాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.



అగమ్య గోచరం

- కుటుంబంలో ఒక్కరికే అన్నదాత సుఖీభవ
- భూమి ఉన్నా, పాస్ పుస్తకం ఉన్నా మిగతా వారికి గగనమే
- రిటైర్డ్ ఉద్యోగులకు, ట్యాక్స్ కట్టే వారికి కూడా ఎగనామం
- వైఎస్ జగన్ సర్కార్‌లో జిల్లాలో 2.20 లక్షల మంది రైతులకు రైతు భరోసా
- కూటమి సర్కార్ తీరుపై అన్నదాతల ఆక్రోశం



సాక్షి రాయచోటి: ప్రకృతి వైపరీత్యాలతో పాటు.. కల్లోల్లాలతో కష్టకాలం ఎదుర్కొంటున్న అన్నదాతలకు మళ్లీ అన్నదాత సుఖీభవ గండం మొదలైంది. వ్యవసాయాన్నే నమ్ముకున్న వారికి ఆందోళన తప్పడం లేదు. కనీసం ప్రభుత్వాలైనా కష్టకాలంలో స్వాంతన చేకూర్చాలి. కరువు కాలంలో ఉన్న అన్నదాతను ఆదుకోవడంతోపాటు భరోసా కల్పిస్తే వ్యవసాయాన్ని కర్షకుడు పండుగలా మారుస్తాడు. గతంలో వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే...ప్రతి ఏడాది మే నెలలో పెట్టుబడి భరోసా నిధులు విడుదల చేస్తూ రైతుకు అండగా నిలిచిన పరిస్థితులు సాక్షాత్కరిస్తున్నాయి. అప్పట్లో భూమితోపాటు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా సొమ్ములు అందించిన పరిస్థితులు కనిపిస్తుండగా ప్రస్తుత కూటమి సర్కార్ హయాంలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళన కలిగించే పరిణామం.

కుటుంబంలో ఒక్కరికేనా?
ఏడాది కిందట సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చి ప్రస్తుతం అమలు చేయలేక అల్లాడి పోతున్న కూటమి సర్కార్ అందుకు సాకులు వెతుక్కుంటోంది. ప్రధానంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినా..ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇప్పటికీ ఒక్క విడత కూడా అందించిన పాపాన పోలేదు. ఇప్పుడు అందించడానికి కసరత్తు చేస్తున్నా, అందులో చాలామందికి సుఖీభవ నిధుల విషయంలో కుచ్చుటోపీ పెట్టేలా కనిపిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా భూమి ఉన్నా...పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు కాకుండా కేవలం కుటుంబంలో ఒక్కరికే ఇవ్వాలన్న ఆలోచన రైతుల్లో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ఒక ఇంటిలో తండ్రి, కొడుకు ఉంటే ఎవరికి వారుగా పొలాలు పంచుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకరికే పరిమితతం చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా ఉద్యోగులు, ప్రైవేట్ వర్గాలు, ట్యాక్సులు చెల్లించేవారు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి వ్యవసాయం చేస్తున్నా వారికి కూడా సుఖీభవ నిధులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం సొమ్ములు ఎంతమందికి అందుతుందోనని ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రతి ఏడాది మేలో రైతు భరోసా

2019లో అధికారంలోకి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ప్రతి ఏడాది మే నెలలోనే నిధులు విడుదల చేసేవారు. ఎందుకంటే ఖరీఫ్‌లో పంట సాగు మొదలుపెట్టే రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఆశయంతో వైఎస్ జగన్ సర్కార్ పెట్టుబడి సాయం కింద నిధులు విడుదల చేసే పరిస్థితి ఉండేది. జిల్లాలో సుమారు 2.20 లక్షల మంది అన్నదాతలు ఉండగా, దాదాపు అందరికీ అందించే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి సర్కార్ నిబంధనల సాకుతో ఎంతమందికి ఎగనామం పెడుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వ్యవసాయాధికారులు అర్హులైన వారందరికీ అందిస్తామంటున్నా నిబంధనలు దాటుకుని ముందుకు వెళితేగానీ ఎంతమందికి సుఖీభవ అందుతుందో అగమ్యగోచరంగా మారింది. అంతేకాకుండా రైతులకు సంబంధించి 20 వేలు పెట్టుబడి సాయాన్ని అందిస్తామని ప్రకటించిన సర్కార్ ఒకేసారి ఇస్తారా? రెండు విడతల్లో ఇస్తారా? అన్నది కూడా స్పష్టత లేకపోవడం మరింత ఆందోళనకరం.

రైతన్నల్లో ఆక్రోశం

జిల్లాలో అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూస్తున్నా.. కుటుంబంలో ఒక్కరికే అన్న ప్రభుత్వ ఆలోచన నేపథ్యంలో అన్నదాతల్లో ఆక్రోశం పెల్లుబుకుతోంది. ఒక వైపు వైఎస్సార్‌సీపీతోపాటు వామపక్షాలు, రైతు సంఘాల్లో కూడా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. భూమి ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా పాసుపుస్తకం ఉన్న రైతులకు సాయం అందితేనే న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

బుక్ చేస్తున్నారు!

- సీఎంఓ డైరెక్షన్... కలెక్టరేట్ యాక్షన్!
- టీడీపీ మహానాడు కోసం ముందస్తు బుకింగ్
- లాడ్జిలు, వసతి భవనాలు స్వాధీనం చేసుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి కార్యాలయం దిశానిర్దేశం చేయగా.. కలెక్టరేట్ రంగంలోకి దిగింది. వైఎస్సార్ జిల్లా కడపలో ప్రభుత్వ, ప్రైవేటు లాడ్జిలు, కల్యాణమండపాలు, వసతి భవనాలు, కళాశాల హాస్టల్స్ ఇలా ఒక్కటి వదలడం లేదు. ఈ నెల 27,28,29 తేదీల్లో చేపట్టిన తెలుగుదేశం పార్టీ మహానాడు కోసం ఎక్కడికక్కడ వసతికి అనువైన ఒక్క భవనం కూడా వదలకుండా బుక్ చేస్తోంది. అంతేనా.. ఆ 3 రోజులు ఇతరులెవ్వరికీ ఇవ్వకూడదంటూ యాజమానులకు ఆర్డర్ వేస్తోంది.

- కడప రింగురోడ్డులో ఉన్న పబ్బాపురం-చెర్లోపల్లె టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో మహానాడు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో భూమి చదును కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మహానాడు వేదిక ఏర్పాటుకు కావాల్సిన చర్యలు ఓ వైపు కొనసాగుతుండగా, మరోవైపు టీడీపీ నేతలకు వసతి సమకూర్చే చర్యలకు స్వయానా ప్రభుత్వ అధికారులు సిద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలో అవకాశం ఉన్న ప్రతి వసతి గృహాన్ని పరిశీలించడం, ఆపై బుక్ చేయడంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసులు నిమగ్నమయ్యారు.



ప్రైవేటు కళాశాలపై ప్రత్యేక దృష్టి....
కడప రింగు రోడ్డులో మహానాడు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ కళాశాలల హాస్టల్ భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఆయా కళాశాలల హాస్టల్ భవనాలను అదుపులో ఉంచుకంటే వందలాది మందికి ఒక్కో భవనంలో వసతి కల్పించవచ్చునే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదివరకే జిల్లాలో ఇలాంటి చర్యలకు ఆయా ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. తాజాగా ప్రభుత్వ యంత్రాంగం రంగ ప్రవేశం చేసింది. సీఎంఓ ఆదేశాల మేరకు కలెక్టరేట్ వర్గాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు వసతి గృహాలు, లాడ్జీలు, కళాశాలలను అదుపులోకి తీసుకుంటున్నారు. ఆ మూడు రోజులు తమకు అప్పగించాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు.

కడపలో నిర్వహణపై డైలమా....

టీడీపీ మహానాడు కడపలో నిర్వహణపై ఇప్పటికీ సందిగ్ధం కొనసాగుతోంది. జిల్లాలో తెలుగుతమ్ముళ్ల మధ్య ఉన్న విభేదాలతో పలు పర్యాయాలు పర్యటించి స్థల ఎంపిక చేపట్టారు.అనువైన స్థలాన్ని ఎంపిక చేసినప్పటికీ గుంటూరు-కృష్ణా జిల్లాల్లోనే మహానాడు చేపట్టాలని అక్కడి నాయకులు పట్టుబడుతున్నట్లు సమాచారం.మరోవైపు ఇండియా-పాకిస్తాన్ ఉద్రిక్తతలు తీవ్రమయ్యే నేపథ్యంలో మహానాడు నిర్వహణకు అభ్యంతరం చెప్పే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఈనెల 14న సీఎం చంద్రబాబు నేతృత్వంలో మహానాడు నిర్వహణపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మహానాడు 3రోజులు నిర్వహించాలా,ఒక్క రోజుతో ముగించాలా? ఒక్కరోజు అయితే కడపలో నిర్వహించడం అవసరమా? ఇలాంటి ప్రశ్నలన్నంటికీ చంద్రబాబు నిర్వహించే ఆ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు నేతలు చెబుతున్నారు.

కష్టం ఒకరిది.. లాభం మరొకరికి

- నల్ల గంగమ్మ రోడ్డు పేరుతో రూ. 1.40 కోట్లు దోపిడీ
- రోడ్డు వేసింది వైఎస్సార్‌సీపీ నాయకులు.. బిల్లు చేసుకుంది మంత్రి పీఏ
- మరో రూ.35 లక్షల బిల్లులు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి



గత ప్రభుత్వం హయాంలోనే కిలో మీటర్ మేర రూపు దిద్దుకున్న రహదారి

టాస్క్ ఫోర్స్: నల్ల గంగమ్మ సాక్షిగా కూటమి ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడింది. ఆలయాల అభివృద్ధికి సహకరించాల్సిన నేతలే వాటి పేరు చెప్పి దోచుకోవడంపై ప్రజలు మండి పడుతున్నారు. నల్లగంగమ్మ ఆలయాన్ని అడ్డుపెట్టుకొని ముందుగా వేసిన రోడ్డుపై సిమెంట్ రోడ్డును మాత్రమే వేసి మొత్తం పనులు తామే చేసినట్లు రూ.కోటి 40 లక్షల రూపాయలు బిల్లును దోచుకున్న ఉదంతం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పీఏ రెడ్డి కుమార్ ఈ దోపిడీకి పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రూ. కోటి 75 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు మొదటి విడతగా రూ.కోటి 40 లక్షలు బిల్లులు చేశారు. కొండేటి శ్రీనివాసులునాయుడు పేరున గత ఏడాది (2024) ఆగస్టు 20వ తేదీన కోటి 39 లక్షల, 62వేల 206 రూపాయలు బ్యాంక్ అకౌంట్లో జమ అయింది. ఈ బిల్లు మొత్తం (ఆగస్టు 21న) మరుసటి రోజే మంత్రి పీఏ ఎ.రెడ్డికుమార్‌కు ముట్టినట్లు సమాచారం. మిగిలిన రూ.35 లక్షలకు బిల్లులు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి పీఏ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే అధికారులు మాత్రం ఇప్పటికే చేయని పనులకు కూడా బిల్లులు చేసి తప్పు చేశామని, మిగిలిన వాటికి బిల్లులు పెడితే మా ఉద్యోగాలు ఊడతాయని వాపోయినట్లు సమాచారం.పీఏ మాత్రం బిల్లులు చేయాల్సిందే అంటూ హుకుం జారీ చేసినట్లు వినికిడి.

రూ. 50 లక్షలతో మట్టి రోడ్డు..
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 50 లక్షలు ఖర్చుచేసి 950 మీటర్ల మేర మట్టి రోడ్డును పూర్తి చేశారు. అప్పట్లో ఈ రోడ్డుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ అనుమతులు తెప్పించి మట్టి రోడ్డుపై సిమెంట్ రోడ్డును పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అనుమతితో స్థానికులు రూ.75 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ మేరకు అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి భూమి పూజ చేసి మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. స్థానికుల సాయంతో స్థానిక నాయకుడు ఒకరు రూ.50 లక్షలు ఖర్చు చేసి మట్టి రోడ్డు, విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. అప్పటి ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో అధికారులు బిల్లులు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా మంత్రి పీఏ ఖాతాలో జమ చేసుకున్నట్లు సమాచారం.

- సంబేపల్లె మండల ప్రజలే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు అందించిన విరాళాలతో గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేశారు.ఈ గుడికి కిలోమీటర్ దూరంలో ఉన్న చిత్తూరు- కడప జాతీయ రహదారి నుంచి సిమెంట్ రోడ్డు వేయడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.75 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించింది. అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి రోడ్డు పనుల ప్రారంభానికి భూమి పూజ చేశారు. అధికారుల అనుమతితో రూ.50 లక్షల ఖర్చు చేసి మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రభుత్వంలో చేసిన పనికి ఒక్క రూపాయి ప్రభుత్వ బిల్లుకు నోచుకోలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో చేసిన పనులను కలుపుకుని బిల్లులు చేసుకోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

మంత్రి పీఏ లీలలు

సచివాలయ ఉద్యోగిగా ఉన్న రెడ్డికుమార్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పీఏగా నియమితులయ్యారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంబేపల్లె మండల కేంద్రంలో పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. సంబేపల్లె మండల రెవెన్యూ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న 91 సర్వే నంబర్ లో 38.85 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో గుట్ట పోను మరికొంత భూమి చెట్లు, చామలతో నిండి ఉంది. ఇందులో ఒక ఎకరం పైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ కంచవేశారు. అనుకున్నదే తడువుగా భూమిని అంతా చదును చేసి బోరును వేయించారు. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేయించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా అందించిన ఆటోలలో తనకు అనుకూలమైన ముగ్గురికి ఆటోలు ఇప్పించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ సీరియస్ అయినప్పటికీ మంత్రి వారించడంతో పరిస్థితి సద్దుమణిగింది.



మంత్రి పీఏ ఆక్రమించిన భూమి ఇదే

మెగా డీఎస్సీకి శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలో అర్హత గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు మెగా డీఎస్సీ పరీక్షకోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కె.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. నేటివిటీ, కుల సర్టిఫికెట్లు, ఆదాయ ధృవీకరణపత్రం, టెట్ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితా జతచేసి అన్నమయ్య జిల్లా కేంద్రం రాజంపేట రోడ్డులోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు శ్రీదేవరరాయి నల్లగంగమ్మ జాతర

సంబేపల్లె: భక్తుల కొంగు బంగారమైన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి జాతర ప్రతి ఏటా మొలకల పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సోమవారం ఉదయం నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరుగుతాయని, రాత్రి జాతర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. అమ్మవారిని పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు నిత్యం దర్శించుకుంటున్నారు.

మహా మండపం నిర్మాణం..
అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో ఆలయ మహామండపం నిర్మాణానికి రూ.1.18కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2022 ఫిబ్రవరి 4న మహామండపం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పూర్తికావడంతో ఆలయం సర్వాంగ సుందరంగా తయారైంది.గుడి ప్రాంగణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు
సోమవారం ఉదయం 5 గంటలకు అభిషేకం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం. 12:30కి భక్తిగీతాల ఆలాపన, సాయంత్రం 6:30గంటలకు అమ్మవారి పల్లకీ సేవ, రాత్రి 7:30కి అన్నదాన కార్యక్రమం. రాత్రి 8:30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.





శ్రీదేవరరాయి నల్లగంగమ్మతల్లి, జాతరకు ముస్తాబు అవుతున్న అమ్మవారి ఆలయం



టమాట.. దోబూచులాట

- ఒక్కోచోట ఒక్కోలా ధరలు
- అన్నమయ్యకు ఊరట.. చిత్తూరుకు నిరాశ
- ఒకేరోజు 2,107.38 టన్నుల టమాట
- రూ.15తో కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి చిత్తూరు ఏడీ లేఖ



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాట



పలమనేరు మార్కెట్ నుంచి ఎగుమతి అవుతున్న టమాట

మదనపల్లె: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టమాట ధరలు ఒక్కోచోట ఒకలా పలుకుతున్నాయి. ప్రస్తుత అన్నమయ్య జిల్లాలోని ఉమ్మడిజిల్లాకు చెందిన టమాట మార్కెట్లలో ధరలు ఆశాజనకంతో ఉండగా, చిత్తూరుజిల్లాలోని మార్కెట్లలో నిరాశకు గురి చేస్తున్నాయి. పంట సాగు విస్తీర్ణం పెరడగం, దిగుబడులు పెరగడం, ఎగుమతులు తగ్గడం ధరలపై ప్రభావం చూపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం టమాట రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. 2021-22లో కర్ణాటక ప్రభుత్వ తరహాలో టమాటను ప్రభుత్వమే కొనుగోలుచేసి వినియోగదారులకు విక్రయిస్తే ఇద్దరికి ప్రయోజకరంగా ఉంటుందని చిత్తూరు మార్కెటింగ్ ఏడీ పరమేశ్వర్ శనివారం ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం స్పందించే తీరునుబట్టి ధరలపై ప్రభావం ఉండనుంది

పశ్చిమ రైతుకు ఊరట
అన్నమయ్య జిల్లా (చిత్తూరు పశ్చిమ)లో శనివారం టమాట ధరల్లో ఊరట కలిగింది. జిల్లాలోని మదనపల్లె, ములకలచెరువు, గుర్రంకొండ, కలికిరి మార్కెట్లకు రైతులు పండించిన టమాట విక్రయానికి తెచ్చారు. ఇక్కడికి ఒకేరోజు 775.72 టన్నుల టమాట వచ్చింది. ఈ సీజన్‌లో ఈస్థాయిలో దిగుబడి ఎక్కువకాదు, తక్కువకాదు. జిల్లాలో మదనపల్లె, ములకలచెరువు మార్కెట్లకే (కర్ణాటకలోని కోలారు మార్కెట్‌కు వెళ్లేదికాక) అధిక టమాట వస్తుంది. ఇక్కడి ట్రేడర్లు పంటను ఎగుమతిచేసే పరిమాణాన్ని బట్టి ధరలు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఎగుమతులు తగ్గాయి. ఇక్కడినుంచి ఒడిస్సా, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు మాత్రమే ఎగుమతి అవుతోంది. గతంలో ఒకట్రెండు రాష్ట్రాలకు మినహా అన్ని రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. దీంతో ప్రస్తుతం కిలో టమాట ధర రూ.తొమ్మిది నుంచి రూ.10 పలికింది. ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరినప్పటికీ దిగుబడిపై ప్రభావం చూపడంతో కొంతమేర ధరల్లో ఊరట ఇస్తోంది.

చిత్తూరులో దారుణం
ఈ జిల్లాలోని మార్కెట్లలో శనివారం ధరలు నిరాశకు గురిచేశాయి. కిలో ధర రూ.4.40 పైసల నుంచి రూ.8 పలికింది. ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో రూ.250 వరకు పలికింది. దీంతో ప్రస్తుతం పంట విస్తీర్ణం పెంచి సాగు చేశారు. ఫలితం ఊహించని విధంగా శనివారం ఒక్కరోజే 1,331.66 టన్నుల టమాట వచ్చింది. ఇందులో పుంగనూరు మార్కెట్‌కు 759.64 టన్నులు వచ్చిపడింది. ఉమ్మడి జిల్లాలో టమాట భారీ దిగుబడులకు కేరాఫ్ మదనపల్లె మార్కెట్‌ను మించిపోయిందంటే ఇక్కడి దిగుబడులు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టం అవుతోంది. శనివారం పలమనేరు, పుంగనూరు మార్కెట్ల నుంచి చెన్నై, వేలూరు, ఆర్కాడ్, ఆంబూర్‌లకు 300 టన్నులు, విశాఖపట్నంకు 80 టన్నులు, విజయవాడ, గుంటూరు, నెల్లూరుకు 200 టన్నులు, హైదరాబాద్‌కు 350 టన్నుల టమాట ఎగుమతి అయ్యాయి. అయినప్పటికీ ధరల పెరుగుదల లేదు.

ఉమ్మడి చిత్తూరుజిల్లా మార్కెట్లలో ధర(కిలో రూ.లలో)...

మార్కెట్	అధికం	మధ్యస్థం	సగటు	టన్నులు
మదనపల్లె	109	100	90	465
గుర్రంకొండ	100	92	80	89.62
కలికిరి	93	86	80	38.10
ములకలచెరువు	100	90	80	183
పలమనేరు	71	52	44	467.02
వీ.కోట	76	60	50	105
పుంగనూరు	80	70	60	759.64

కొంటోంది 20 క్వింటాళ్లే

టమాట ధరలు పతనం అయితే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. అత్యధిక టమాట వస్తున్న పుంగనూరు మార్కెట్‌లో ప్రభుత్వం గురువారం నుంచి రోజుకు 20 క్వింటాళ్లను మార్కెటింగ్‌శాఖ కొనుగోలు చేస్తోంది. ఈ మూడురోజుల్లో 60 క్వింటాళ్ల టమాటను కిలో రూ.8తో రైతులనుంచి కొన్నారు. ఏప్రిల్ 10-12 తేది ల్లో కిలో రూ.10-12లతో కొనుగోలుచేసి ఇప్పుడు ధర తగ్గించేసింది. గతనెలలో పలమనేరులో 500 టన్నుల టమాటను కొనగా ఇప్పుడు క్వింటాళ్లకు తగ్గించేసింది.

కర్ణాటక తరహా కొనుగోళ్లు

2021, 2022 సంవత్సరాల్లో కర్ణాటకలో టమాట ధరలు పతనం అయ్యాయి. దీంతో రైతులకు కనీస గిట్టుబాటు లేకుండాపోగా నష్టాలు చవిచూశారు. దీనిపై అప్పటి ప్రభుత్వం రైతులు పండించిన టమాటను కిలో రూ.12తో కొనుగోలు చేసింది. వాటిని తిరిగి విక్రయించకుండా చెరువుల్లో పారబోసింది. ఫలితంగా టమాట ధరలు పెరిగి రైతులకు ఊరట కలిగింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో చిత్తూరు ఏడీ పరమేశ్వర్ ప్రభుత్వానికిలేఖ రాశారు. టమాటను ప్రభుత్వమే కిలో రూ.15తో కొనుగోలుచేసి ప్రజలకు రూ.10 విక్రయిస్తే రైతులకు, వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుందని లేఖలో సూచించారు. మిగిలిన రూ.5లను రాయితీగా ప్రకటిస్తే రైతాంగాన్ని పూర్తిగా ఆదుకునేందుకు సాధ్యమవుతుందని సూచన చేశారు.

క్లుప్తంగా

చంద్రారెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న చంద్రారెడ్డి

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాల వీడియో, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ మేరకు ఆయనకు తమిళనాడు వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ తమిళనాడులోని అన్ని వర్గాల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సహాయ సహకారాలతో రాష్ట్ర ఉమ్మడి ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ సంఘాల కోసం అంకిత భావంతో పనిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని తెలుగు వారు తమిళనాడు వారితో కలిసి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి మృతి


బలరామిరెడ్డి(ఫైల్)

కొండాపురం : ఉమ్మడి కడప జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డి(88) శనివారం ఉదయం చెన్నైలో తన నివాసంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురానికి చెందిన సీఎం బలరామిరెడ్డి 1937 సంవత్సరంలో జన్మించారు. కొండాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1983 నుంచి 1993 వరకు రెండు పర్యాయాలు జిల్లా జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ, చేనువారిపల్లి గ్రామానికి చెందిన దారా మునెయ్య హత్య కేసులో శనివారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు .. చేనువారిపల్లి గ్రామ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో మునెయ్య వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అతను ఏప్రిల్ 28 వ తేదీన పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ అన్న నల్లబోతుల వెంకట రమణ, మండల వాణి అలియాస్ రాణెమ్మలు మునెయ్యతో ఘర్షణ పడ్డారు. దీంతో వారు రాళ్లతో దాడి చేసి చంపి, కాల్చేశారని విచారణలో తేలింది. వీరిరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

తల్లికి వందనం.. వీడని సందిగ్ధం!

- జిల్లాలో 2731 పాఠశాలల్లో 2,41,026 మంది విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రభుత్వం తాజా నిర్ణయాలు, నిబంధనలతో నీలినీడలు
- ఒకేసారి ఇస్తారా లేక కంతుల వారీగానా అన్న అనుమానాలు
- కొత్త నిబంధనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



రాయచోటి : తల్లికి వందనంపై ప్రభుత్వం వైపు నుంచి వారి అనుకూల పత్రికలు, సోషల్ మీడియా ద్వారా వినిపిస్తున్న నిబంధనలు, మార్గదర్శకాలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళనలు, నీలినీడలు అలుముకున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఇస్తామన్న తల్లికి వందనం గత ఏడాదికి వర్తిస్తుందా లేక రానున్న విద్యా సంవత్సరానికి వర్తిస్తుందా అన్న విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా మే నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నిధులకు సమాయాత్తమవుతోంది. ఈ మేరకు మార్గదర్శకాలపై జరుగుతున్న కసరత్తుతో ఎంత మంది తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందోనన్న కలవరం మొదలైంది. విద్యా సంవత్సరం ప్రారంభం ముందుగానే తల్లికి వందనంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది అన్న ప్రచారం జరుగుతోంది. తాజాగా సీఎం చంద్రబాబు ఈ పథకం అమలుపైన స్పష్టత ఇచ్చినా నమ్మకం లేకుండాపోయింది. ఒకవేళ చెల్లిస్తే ఇదే విడతలోనే అమలు చేస్తారా.. రెండు విడతలుగా చెల్లిస్తారా అనేది చర్చగా మారింది. ఇక దాదాపుగా ఈ పథకం అమలులో నిబంధనలు ఖరారైనట్లు జరుగుతున్న ప్రచారంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

అమలుపై కసరత్తు..

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనంపైన చేస్తున్న కసరత్తుపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. బడ్జెట్‌లో ఈ పథకం కోసం నిధులు కేటాయించినా పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. హామీ ఇచ్చిన విధంగా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున ఇస్తారా లేక నిబంధనల పేరుతో కోత పెడతారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో ఈ పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు ఇప్పుడు లబ్ధిదారుల ఎంపికలో కీలకం కానున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలోగానే తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారుల సభలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటన చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఇస్తామని చెబుతూనే.. ఒక ఇన్‌స్టాల్‌మెంటా లేక ఎలా ఇవ్వాలనేది ఆలోచన చేస్తున్నామని వెల్లడించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

చంద్రబాబు నుంచి రాని క్లారిటీ..

తల్లికి వందనం పథకాన్ని విద్యా సంవత్సరం ప్రారంభం ముందే అమలు చేస్తామని చెబుతున్నా పథకం అమలు విషయంలో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. దీంతో ఒకే విడతలో రూ.15 వేలు చెల్లిస్తారా.. రెండు విడతలుగా రూ.7500 చొప్పున చెల్లించే ఆలోచన చేస్తున్నారా అనే చర్చ మొదలైంది.

నిబంధనలు..

ఈ పథకం అమలుకు సంబంధించిన విధివిధానాలపైన అధ్యయనం కొనసాగుతున్నట్లు సమాచారం. పథకం అమలులో భాగంగా విద్యార్థులకు 75 శాతం హాజరు నిబంధన కొనసాగనుంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను సమీక్షిస్తున్నారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, తెల్లరేషన్‌కార్డులు లేని వారిని, 300 యూనిట్ల విద్యుత్ వినియోగించేవారిని, కారు కలిగి ఉన్న వారిని, అర్బన్ ప్రాంతంలో 1000 చదరపు అడుగులు కలిగి ఉన్న వారికి పథకం వర్తిస్తుందా లేదా వేచి చూడాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త నిబంధనలను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. విద్యుత్ వినియోగం, కారు ఉండటం వంటి నిబంధనలను గతంలో వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు మినహాయింపు ఇస్తారా.. లేక కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

ఇప్పటికే ఈ పథకం అమలుకు సంబంధించిన లబ్ధిదారుల సంఖ్య.. కావాల్సిన నిధుల పైన ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే నెలలో అన్నదాత సుఖీభవ తొలి విడత నిధులను విడుదల చేయాల్సి ఉండటంతో ఇన్‌స్టాల్‌మెంట్ అంశం తెరపైకి వచ్చినట్లు కనిపిస్తోంది. 2025–26 బడ్జెట్‌లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించారు. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2,41,026 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇందులో ప్రాథమికంగా ఈ పథకానికి ఎంత మంది విద్యార్థులు అర్హులుగా ఉంటారో విద్యాశాఖ తేల్చాల్సి ఉంది.

4 కేజీల గంజాయి స్వాధీనం

– అదుపులో ముగ్గురు నిందితులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని దేవపట్ల రోడ్డు మార్గంలో నిర్వహించిన తనిఖీలలో గంజాయితో వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 4.100 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గంజాయితో ముగ్గురు నిందితులు వెళ్తున్నట్లు తమకు ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు చిన్నమండెం ఎస్‌ఐ సుధాకర్, వారి సిబ్బందితో కలిసి దేవపట్ల రోడ్డు మార్గంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో 4.100 కేజీల గంజాయితో పాటు చిన్నమండెంకు చెందిన షేక్.హాసిం సాహెబ్, మ్యాజిక్ ఇమ్రాన్‌ఖాన్, కలకడ మండలం బంగారుపల్లికి చెందిన షేక్.ఇమాంసాబ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

బెంగళూరులో సంబేపల్లె యువకుడి మృతి


సాయిమహేశ్(ఫైల్)

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన సుండుపల్లె సాయి మహేశ్ (21) శుక్రవారం రాత్రి బెంగళూరులో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన సాయి మహేశ్ బతుకు దెరువుకోసం బెంగళూరులో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బెంగళూరులోని బైపనల్లి రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. గతంలో మృతుని తండ్రి పెద్దరెడ్డెయ్య చనిపోయాడు. మృతుని తల్లి ఇందిరమ్మ, తమ్ముడితో పాటు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు భారత ప్రభుత్వం అనుమతి

వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి

తిరుపతి కల్చరల్ : తిరుపతిలో గత 22 ఏళ్లుగా బీఎస్ఆర్ విద్యాసంస్థల ద్వారా క్రమశిక్షణతో కూడి విద్యతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఇటు విద్యార్థుల ఉన్నతికి, దేశ రక్షణకు అందిస్తున్న సేవలను గుర్తించి భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైనిక్ స్కూల్ అనుమతి పొందిందని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అందరి సహకారంతో భారత రక్షణ దళానికి ఎంతో మంది సైనికులను అందించేలా కృషి చేశామన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ స్థాపించినప్పటి నుంచి అనుభజ్ఞులైన వారిచే అత్యుత్తమమైన విద్యాప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు శారీరక, మానసిక, మానవీయ విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఆదరణ పొందామన్నారు. భారత ప్రభుత్వం గుర్తింపుతో మరింత బాధ్యతగా దేశ భద్రత కోసం వెరిటాస్ సైనిక్ స్కూల్ ముందడుగు వేస్తోందన్నారు. దేశానికి అవసరమైన విద్యను యువతకు డిఫెన్స్ రంగాలలో ఎన్‌డీఏ, టీఈఎస్ వంటి ఉత్తమమైన ఉద్యోగ అవకాశాలను కేవలం 17 ఏళ్ల వయస్సులోనే పొందే విధంగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. ఇకపై ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. విద్యాసంస్థలో ప్లస్–1 ఇంటర్మీడియట్‌తో స్పెషల్ ఎన్‌డీఏను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ డైరెక్టర్లు బి.శ్రీకర్‌రెడ్డి, బి.సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సమావేశం ఎన్.జి.ఓ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలుకై చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత దేశంలోని యావత్ కార్మికవర్గం మే 20వ తేదీన సమ్మె చేయడం ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సార్వత్రిక సమ్మె ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం ధరలకు అనుగుణంగా 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మే 20 సమ్మెలో కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా భారీగా పాల్గొనడం ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రాజేశ్వరి, నాయకులు మధురవాణి, కృష్ణమూర్తి, ఐద్వా నాయకురాలు భాగ్యమ్మ తదితరులు మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయడం, ఇండియన్ లేబర్ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం, నెలవారీ కనీస వేతనం రూ. 26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ పెన్షన్ రూ. 9,000 అందించడం సహా పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రానివారికి నెలకు రూ. 6,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ రాజు, కృష్ణప్ప, శంకర్ నాయక్, గౌరీ, ప్రమీల, సుగుణ, ప్రభావతి, అఖిరున్నిష, విజయ తదితరులు పాల్గొన్నారు.

పేడ నీళ్లు చల్లే విషయంలో ఘర్షణ


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

జమ్మలమడుగురూరల్ : ఇంటి ముందు పేడ నీళ్లు చల్లే విషయంలో జరిగిన చిన్న చిన్న పాటి గొడవ పెద్దదై పరస్పరం దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. బొగ్గు గురులక్ష్మి తన ఇంటి ముందు పేడ నీళ్లు చల్లుకుంటూ ఉండగా కొన్ని నీళ్లు పక్కన నివాసం ఉంటున్న రాజచౌడయ్య ఇంటి వద్ద పడ్డాయి. ఈ విషయమై ఇరువురి మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం జరిగింది. దీంతో ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇరు కుటుంబాలకు చెందిన వారు గాయపడ్డారు. గాయపడి వారిలో బొగ్గు నాగ అంజి, మహేష్, నాగేంద్ర, మల్లికార్జున, రామాంజనేయులు, గురులక్ష్మి, మరోవర్గంలో గూడెంచెరువు రాజ చౌడయ్య, సోమశేఖర్, పెద్ద చౌడప్ప, రమణమ్మ, రామ చౌడయ్య ఉన్నారు. రాజ చౌడయ్యకు తలపై బలమైన గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు

ప్రపంచానికి భారత సైనిక సామర్థ్యం తెలియజెప్పాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారత సైనిక సామర్థ్యం ఏమిటో తెలియజెప్పామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రారంభ సమయంలోనే మన దాడికి తట్టుకోలేక ఇతర దేశాల మధ్యవర్తిత్వం అభ్యర్థించి కాల్పుల విరమణకు ముందుకు రావడంతోనే పాకిస్తాన్ తోక ముడిచిందన్నారు. పెహల్గాంలో అమాయకులను బలి తీసుకున్న ఉగ్రవాదులను అంతమొందించి ప్రాణాలు విడిచిన అమాయక పౌరులకు ఆత్మశాంతి కల్గించిన భారత సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. భారత సైనికులకు, అమర వీరుల కుటుంబాలకు దేశమంతా అండగా ఉంటుందని తెలిపారు. యుద్ధం వల్ల ప్రతి ఒక్కరికీ నష్టమేనని పాకిస్తాన్ నిజాయితీ, సిద్ధాంతాలు వదిలి ప్రజలపై కాల్పులు జరిపితే మనదేశం కేవలం ఉగ్రవాద శిబిరాలపైనే దాడులు చేసి ప్రజల జోలికి వెళ్లకుండా ప్రపంచానికి యుద్ధనీతి తెలియజేసిందన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కోసం.. కదిలిన వారసులు!

- ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య
- ఉభయ తెలుగు రాష్ట్రాలలో సంకీర్తనల సేవ
- ఏటా అన్నమయ్య వర్ధంతి, జయంతి, ఆరాధనోత్సవాలు
- నడుం బిగించిన అన్నమయ్య 12వ తరం వారసులు


వైజాగ్‌లో అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలలో భాగంగా అన్నమయ్యలో సంకీర్తన సేవ దృశ్యం(ఫైల్)

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తనలు విశ్వవ్యాప్తి చేసేందుకు అన్నమయ్య వారసులు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో 2005లో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టును ఆగస్టు 30న తిరుపతిలో ప్రారంభించుకున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు. 12వ తరం అన్నమయ్య వారసులు ఏర్పాటుతో ప్రారంభమై ఇప్పుడు 13వ తరం వారసులు కూడా నేటి కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)లో అన్నమయ్య సేవా సంస్కృతి అన్న పేరుతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు.

ఊరూరా అన్నమయ్యలో..

ఊరూరా అన్నమయ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆలయాలకు వెళ్లి సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విష్ణుపురాణం, హనుమాన్ చాలీసా, నగర సంకీర్తన కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నమయ్య పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అన్నమాచార్య సంకీర్తనలు, కోలటాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. సామాజికసేవ, ఆధ్యాత్మికసేవ, అన్నమయ్య సంకీర్తన ప్రచార సేవ, సాంస్కృతిక సేవ, భక్తిసేవ, సంగీతసేవ, పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా అన్నమయ్య సంకీర్తనలు నేర్పిస్తున్నారు. కోలాటంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు స్తోత్ర మంజరి పై కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారు.

ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు..

ప్రతి ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీటీడీ నిర్వహించే అన్నమయ్య జయంతి, వర్ధంతి ఉత్సవాలకు అన్నమయ్య 12 వతరానికి చెందిన హరిస్వామి విధిగా పాల్గొంటున్నారు. ఈ ట్రస్ట్ చైర్మన్‌గా తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్‌గా తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీగా తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయ రాష్ట్రాల డైరెక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్యలున్నారు.

సామాజిక సేవలోనూ..

ప్రతి సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో విశాఖ, కర్నూలు నగరాలలో భక్తులకు దాహం తీర్చేందుకు మంచినీళ్లు, మజ్జిగ వితరణ కేంద్రాలను ఏర్పాటుచేసి అన్నమయ్యసేవను అందిస్తున్నారు. అలాగే పల్స్‌పోలియో, మెడికల్ క్యాంప్, రక్తదానశిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతోంది. అన్నమయ్య బాటలో ఆయన వారసులు ముందుకెళుతున్నారు.

12న అన్నమయ్య జయంత్యుత్సవాల్లో వారసులు..

ఈనెల 12న జరిగే అన్నమయ్య జయంత్యుత్సవాల్లో అన్నమయ్య వారసులు పాల్గొంటారు. వారిని టీటీడీ గౌరవిస్తుంది. అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అన్నమాచార్యుని వంశీయులు కావడం పూర్వజన్మ సుకృతం



అన్నమాచార్యుని వారసులు కావడం మా పూర్వజన్మ సుకృతం. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు చూపిన మార్గంలో మేము నడుచుకుంటున్నాము. శ్రీవారిసేవ చేసుకునే మహాభాగ్యం దక్కింది. ఆధ్యాత్మిక, సామాజిక సేవలను చేస్తున్నాము. అన్నమయ్య కీర్తనలు విశ్వవ్యాప్తం చేసేందుకు. ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని చేపట్టాము. టీటీడీ, భక్తుల సహకారంతో విజయవతంగా నిర్వహిస్తున్నాము.

– తాళ్లపాక హరినారాయణచార్యులు, తిరుమల

నలుదిశలా అన్నమయ్య సంకీర్తనలకు విస్తృత ప్రచారం



తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాలను ఏపీ, తెలంగాణలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామంటే భక్తులు, టీటీడీ సహకారం మరువలేనిది.

– తాళ్లపాక గౌరీ ప్రసన్న, ట్రస్ట్ సెక్రటరీ, తిరుమల